సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 13 । సెప్టెంబర్ । 2025




లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా శనివారం జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించనున్నామని ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి తెలిపారు. 8లో ▸



22 నుంచి శరన్నవరాత్రులు

ఏటా తొమ్మిది రోజుల పాటు ఘనంగా జరిగే శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఈఏడాది 11 రోజుల పాటు జరుగనున్నాయి. 8లో ▸



మూలనపడ్డ ఎన్‌హెచ్‌–165 పనులు

జాతీయ రహదారి–165 నిర్మాణంలో భాగంగా ఆకివీడులో ఉప్పుటేరుపై చేపట్టిన వంతెన పనులు పూర్తిగా నిలిచిపోయాయి. 8లో ▸



అక్షరంపై కక్ష సాధింపు తగదు



అక్షరం ప్రశ్నిస్తుంది.. అక్రమం ఎక్కడుంటే అక్కడ గర్జిస్తుంది. ఒక అక్షరాన్ని బహిష్కరిస్తే లక్ష అక్షరాలు పుట్టుకొస్తాయి. పత్రికా స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు. కూటమి ప్రభుత్వం 'సాక్షి' మీడియాపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. తప్పులు ఎత్తిచూపుతున్న ఎడిటర్, పాత్రికేయులపై కేసులు **పెట్టడం కూటమి ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనం. సమాజంలో ప్రతిఒక్కరూ పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాలి.**

– దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు

పత్రికా స్వేచ్ఛను హరించడం హేయం



ప్రజాస్వామ్యంలో పత్రికా రంగం నాలుగో స్తంభంగా ఉంది. సాక్షి పత్రికపై కూటమి ప్రభుత్వం కక్షగట్టి కేసులు నమోదు చేయడం అత్యంత దారుణం. ప్రభుత్వ లోపాలు, ప్రజల సమస్యలను తెలియజేసే క్రమంలో వ్యతిరేక వార్తలు రావడం సహజం. వాటిలో తప్పొప్పులను బేరీజు వేసుకోవాలి తప్ప **అక్రమ కేసులు బనాయించడం హేయం. ఇది పత్రికా స్వేచ్ఛకు గొడ్డలి**పెట్టు వంటింది. ఇప్పటికైనా **కూటమి సర్కారు తీరు మార్చుకోవాలి.**

– ముదునూరి ప్రసాదరాజు, వైఎస్సార్‌సీపీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు

న్యూస్‌రీల్

డీఏ బకాయిలపై గళమెత్తిన ఉపాధ్యాయులు



ఆందోళన చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

భీమవరం: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం నిరసన వారం కార్యక్రమం ప్రారంభించినట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ పరిమితి రూ.25 లక్షలకు పెంచాలని, అన్నిరకాల యాప్‌లను రద్దు చేయాలని, అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానాన్ని రద్దు చేయాలని నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దసరా పండుగ నాటికి పెండింగులో ఉన్న డీఏలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. జిల్లా కార్యదర్శి ప్రసన్నకుమార్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.శ్రీనివాస్, పి.పీటర్, ఉపాధ్యక్షుడు వై.విజయకుమార్, టి.ఏసేబు, కార్యదర్శులు అరిగెల ఏసేపు, నరేంద్ర, రాంబాబు, రమేష్ బాబు పాల్గొన్నారు.

విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన.. ఉపాధ్యాయుడి సస్పెన్షన్

భీమవరం: పాఠశాల విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు డీఈఓ ఈ.నారాయణ తెలిపారు. భీమవరంలోని మహాత్మాగాంధీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న సీహెచ్ కామేష్ విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించినందున శుక్రవారం విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు చెప్పారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన అవసరం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు బ్యాంకింగ్ ఉత్పత్తులు, సేవలపై అవగాహన కలిగి ఉండాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ డి.నీలాద్రి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శుక్రవారం ఆర్‌బీఐ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలని, పీఎం జీవనజ్యోతి బీమా, సురక్ష బీమా, అటల్ పెన్షన్ యోజన పథకాల్లో నమోదు కావాలన్నారు. ఆర్థిక అక్షరాస్యతను పెంచుకోవాలన్నారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ వి.అశోక్ కుమార్ వర్క్‌షాప్‌ను పర్యవేక్షించారు. రిసోర్స్ పర్సన్లు వై.బాబురావు, ఎస్.అనిల్, బి.సుమంత్, బి.చెన్నారావు బ్యాంకు ఖాతా తెరవడం, లావాదేవీల తదితరాలపై అవగాహన కల్పించారు. అనంతరం బ్యాంకింగ్ ఉత్పత్తుల వివరాలతో ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, సీఆర్ఆర్ బ్రాంచ్ మేనేజర్ పి.సురేష్, ఎస్‌బీఐ ఏలూరు అసిస్టెంట్ మేనేజర్లు ఎస్.మధుకుమార్, బీఎస్ విద్యాసాగర్, కళాశాల ఇన్‌చార్జి బి.ఇంద్రకుమార్ పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి

తణుకు అర్బన్: ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు ఆటో, రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అమరవీరుల భవనంలో నిర్వహించిన ఆటో, స్కూల్, కాలేజీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ యూనియన్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్త్రీ శక్తి పథకం ద్వారా నష్టపోతున్న డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం రూ.15 వేలు ఇస్తానని ప్రకటించిందని, అయితే ఈ మొత్తంతో డ్రైవర్లు జీవనం సాధ్యం కాదని కనీసం రూ.25 వేలు ఇవ్వాలని అన్నారు. ఉచిత బస్సుతో గతంలో ఉన్న ఒకటి, రెండు కిరాయిలు కూడా ప్రస్తుతం ఉండటం లేదన్నారు. చాలా మంది డ్రైవర్లు ఫైనాన్స్ సంస్థల వద్ద అప్పులు చేశారని నెలవారీ ఈఎంఐలు కట్టడం కష్టంగా మారిందన్నారు. యూనియన్ అధ్యక్షుడు ఎ.శ్రీనివాస్, అమిరుద్దీన్, ప్రసాద్, చౌదరి, సుధీర్, మురళి, వంశీ పాల్గొన్నారు.

కూటమి చిన్నచూపు

కానరాని కంటి వెలుగు

- ముఖ్యమంత్రి ఈఐ కేంద్రం సేవలు నిలిచి ఏడాది
- కాంట్రాక్టు సంస్థతో గతేడాది సెప్టెంబరులో ముగిసిన ఎంఓయూ
- కంటి వైద్య సేవల కోసం పేదల ఇబ్బందులు
- ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి
- గతంలో ఉమ్మడి జిల్లాలో 2.35 లక్షల మందికి ఉచితంగా కంటి పరీక్షలు



ఆకివీడు సీహెచ్‌సీలోని కేంద్రంలో కంటి పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు అందిస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి, భీమవరం: కంటి వైద్యసేవలపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటుచేసిన ముఖ్యమంత్రి ఈఐ కేంద్రాల్లో ఏడాది కాలంగా వైద్య సేవలు నిలిచిపోవడంతో పేదవర్గాల వారు ఇబ్బందులు పడుతున్నారు. కంటి పరీక్షల కోసం ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

2018లో ఏర్పాటు : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఆచంట, ఆకివీడు, భీమవరం, భీమడోలు, దెందులూరు, చింతలపూడి, పోలవరం, పాలకొల్లు, నరసాపురంలలోని సీహెచ్‌సీల్లో 2018లో అప్పటి ప్రభుత్వం ముఖ్యమంత్రి ఈఐ కేంద్రాలను ఏర్పాటుచేసింది. వీటి నిర్వహణను ప్రైవేట్ సంస్థకు అప్పగించింది. ఒక్కో కేంద్రంలో ఒక ఆప్తమాలజీ అసిస్టెంట్, ఒక ఎక్యుప్‌మెంట్ అసిస్టెంట్ అందుబాటులో ఉండేవారు. ఆధునాతన ఆటోమెటిక్ రిఫ్రాక్టర్ మీటర్, కంటి లోపల భాగాలను పరీక్షించే ఫండస్ కెమెరాలతో కంప్యూటర్ ద్వారా డీఆర్, గ్లకోమా, కేటరాక్ట్, మాక్యులర్ డీజనరేషన్, హైపర్‌టెన్సివ్ రెటీనోపతి తదితర పరీక్షలు చేసేవారు. అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు అందజేసేవారు. కంటి సమస్యలు, శస్త్రచికిత్సలు అవసరమైన వారిని తొలిదశలోనే గుర్తించి మెరుగైన వైద్య నిమిత్తం సమీపంలోని ఆరోగ్యశ్రీ రిఫరల్ ఆస్పత్రులకు పంపేవారు. పేదవర్గాల వారికి ఈ కేంద్రాలు ఎంతో ప్రయోజనకరంగా ఉండేవి.

ఏడాదిగా నిలిచిన సేవలు

గతేడాది సెప్టెంబరు 4తో కాంట్రాక్టు సంస్థతో ఉన్న ఎంఓయూ గడువు ముగియడంతో సేవలు నిలిచిపోయాయి. అప్పట్లో రెన్యూవల్ చేయకపోవడంతో ఆస్పత్రుల్లోని ఆటోమెటిక్ రిఫ్రాక్టర్ మీటర్, ఫండస్ కెమెరాలు, ఇతర సామగ్రిని కాంట్రాక్టు సంస్థ తరలించుకుపోయింది. దీంతో కంటి వైద్య పరీక్షల కోసం పేదవర్గాల వారు ఇబ్బంది పడాల్సి వస్తోంది. కంటి పరీక్షలు చేసి కళ్లజోడు ఇచ్చేందుకు దాదాపు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు ఖర్చవుతుంది. మొత్తం ఆయా పరీక్షలకు రూ.3,000 వరకు ఖర్చవుతుందని అంచనా. గతంలో ఈ సేవలన్నీ ఉచితంగా అందేవి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కంటి వైద్యులు అందుబాటులో ఉన్న భీమవరం తదితర చోట్ల కొన్ని రకాల కంటి పరీక్షలు నిర్వహిస్తున్నా, ఉచితంగా కళ్లజోళ్లు, పూర్తిస్థాయిలో సేవలు అందించలేని పరిస్థితి ఉందని రోగులు అంటున్నారు. గతంలో మాదిరి కంటి వైద్య పరీక్షల నిర్వహణకు, ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీకి ప్రభుత్వం చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎం ఈఐ కేంద్రాల్లో నేత్ర వైద్య సేవలు

కేంద్రం	మొత్తం పరీక్షలు	రిఫ్రాక్షన్ చెక్స్	కళ్లజోళ్లు	ఫండస్ చెక్స్
ఆచంట	27,970	27,832	18,131	13,831
ఆకివీడు	20,576	20,407	13,688	7,246
భీమడోలు	25,179	21,208	14,020	10,556
భీమవరం	23,944	23,638	17,807	8,899
చింతలపూడి	29,747	25,631	17,625	13,619
దెందులూరు	24,401	22,320	13,499	11,815
పాలకొల్లు	30,553	29,815	21,443	12,491
పోలవరం	25,883	22,420	15,453	9,858
నరసాపురం	27,690	26,666	18,990	10,635

గత ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా..

గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి ఈఐ కేంద్రాల నిర్వహణతో పాటు వృద్ధులు, విద్యార్థుల కోసం గ్రామాల్లో, పాఠశాలల్లో వైఎస్సార్ కంటి వెలుగు శిబిరాలను నిర్వహిస్తూ వచ్చారు. ముఖ్యమంత్రి ఈఐ కేంద్రాల కాంట్రాక్టు సంస్థ మెమోరాండమ్ ఆఫ్ అండర్ స్టాండింగ్ (ఎంఓయూ)ను ఎప్పటికప్పుడు రెన్యూవల్ చేస్తూ వైద్యసేవలకు అంతరాయం కలగకుండా చూసేవారు. ఈఐ కేంద్రాలు ప్రారంభం నుంచి గతేడాది నిలిచేనాటి వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 2,35,943 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 2,199,37 మందికి రిఫ్రాక్షన్ చెక్స్, 98,950 మందికి ఫండస్ చెక్స్ చేయగా, 1,50,656 మందికి కళ్లజోళ్లు అందజేశారు. 884 డీఆర్, 626 గ్లకోమా, 140 మాకులర్ డిజనరేషన్, 14,080 కాటరాక్ట్, 76 హైపర్‌టెన్సివ్ రెటినోపతి రోగులను గుర్తించి సంబంధిత వైద్యసేవలు, శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఒక్కో కేంద్రంలో రోజూ వంద మందికి పైగా రోగులు వచ్చి కంటి వైద్య సేవలను ఉచితంగా పొందేవారు.

హెచ్‌ఐవీని పారదోలుదాం



5కే రన్ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ అమృతం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నివారణ ద్వారానే ఎయిడ్స్ వ్యాధిని సమాజం నుంచి తరిమివేయగలమని, జిల్లాలో హెచ్‌ఐవీ కేసులు పెరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని డీఎంహెచ్‌ఓ పీజే అమృతం అన్నారు. స్థానిక సీఆర్‌రెడ్డి మహిళా కళాశాల నుంచి శుక్రవారం జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో యూత్ ఫెస్ట్ 2025–26, ఐఈసీ మారథాన్ 5కే రెడ్‌రన్ ర్యాలీని ఎర్రబెలూన్లు ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాప్తిని అరికట్టడానికి, వ్యాధి నివారణపై అవగాహన కలిగించడానికి, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు మద్దతుగా నిలవడానికి మారథాన్ 5కే రెడ్‌రన్ నిర్వహించనున్నామన్నారు. హెచ్‌ఐవీ సంబంధిత సమాచారం కోసం జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1097ను సంప్రదించాలని కోరారు. సెట్‌వెల్ సీఈఓ కేఎస్ ప్రభాకరరావు, ఆర్‌ఐఓ ప్రభాకర్, దిశ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జి.ఆదిలింగం పాల్గొన్నారు. ర్యాలీ కలెక్టరేట్ వద్ద గల ఇండోర్ స్టేడియం వరకు చేరింది.

బయోమెట్రిక్ పెండింగ్ పూర్తి చేయాలి

ఏలూరు (టూటౌన్): జిల్లాలోని పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం 25,099 మంది విద్యార్థులకు 22,142 మంది వివరాలు రెన్యూవల్ చేసినట్టు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి వై.విశ్వమోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. మిగిలిన 2,498 మందిలో 2,000 మంది విద్యార్థుల బయోమెట్రిక్ కళాశాలల్లో పెండింగ్‌లో ఉందని, ప్రిన్సిపాళ్లు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు గ్రామ, వార్డు సచివాలయంలో 5 స్టెప్ వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలన్నారు. ఈనెల 30లోపు కొత్త రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్స్ ప్రక్రియ పూర్తికావాలన్నారు.

వర్జీనియా అధరహో

- రికార్డు స్థాయిలో ధర
- కిలోకు అత్యధికంగా రూ.418
- కంపెనీలకు ఆర్డర్లతో రైతులకు ఊరట



వర్జీనియా పొగాకు బేళ్లు

జంగారెడ్డిగూడెం: వర్జీనియా పొగాకుకు రికార్డుస్థాయిలో ధర పలికింది. కిలోకు రూ.418 అత్యధిక ధర లభించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఐదు వేలం కేంద్రాలు ఉండగా, జంగారెడ్డిగూడెం–2, కొయ్యలగూడెం కేంద్రాల్లో కిలోకు రూ.418, జంగారెడ్డిగూడెం–1లో రూ. 417, దేవరపల్లి, గోపాలపురం కేంద్రాల్లో రూ.416 అత్యధిక ధర లభించింది. ఇక కనిష్ట ధర జంగారెడ్డిగూడెం–1, 2, కొయ్యలగూడెం కేంద్రాల్లో కిలోకు రూ.200 రాగా గోపాలపురం, దేవరపల్లిలో రూ.140 లభించింది.

గతేడాది రూ.411 : గతేడాది అత్యధికంగా కిలోకు రూ.411 ధర లభించగా, ఎస్ఎల్ఎస్ పరిధిలో సరాసరి ధర కిలోకు రూ.300 దక్కింది. అయితే ఈ ఏడాది ఇప్పటివరకు ఉత్తర ప్రాంత తేలిక నేలల్లో (ఎస్ఎల్ఎస్) పరిధిలో సరాసరి ధర రూ.296.57 లభించింది. ఇదిలా ఉండగా అత్యధిక ధర రూ.418 నంబర్–1 పొగాకుకు దక్కింది. లోగ్రేడ్ పొగాకుకు సరైన ధర లేదు. లోగ్రేడ్‌కు కూడా మంచి ధర లభిస్తేనే సరాసరి ధర పెరిగి రైతులకు లాభం చేకూరుతుంది. ఇదే ఆశతో వర్జీనియా రైతులు ఎదురుచూస్తున్నారు. కిలోకు సరాసరి ధర రూ.330 రావాలని ఆశిస్తున్నారు.

ఆల్‌టైం హైకు చేరి.. వారం రోజులుగా నిలకడగా కిలోకు రూ.350 లభించిన ధర క్రమేపీ పెరుగుతూ శుక్రవారం ఆల్‌టైం హైకు చేరుకుంది. గతేడాది కంటే రూ.7 అదనంగా పలికింది. ఆయా కంపెనీలకు విదేశీ ఎగుమతుల ఆర్డర్లు రావడమే ధర పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది. దీంతో కంపెనీలు పోటీ పడి బిడ్ వేస్తున్నాయి. మొన్నటివరకు సిండికేట్ అయ్యి తక్కువ ధరకు కొనుగోలు చేయగా, ప్రస్తుతం పోటీపడి మరీ కొంటున్నారు. అంతేకాక ఎస్ఎల్ఎస్‌లో పండిన వర్జీనియా పొగాకుకు సిగరెట్ తయారీలో సుగంధ ద్రవ్యంగా పరిగణిస్తారు. గతేడాది దేశీయ పొగాకుకు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో అప్పట్లో మంచి ధర లభించింది. అలాగే గతేడాది బ్రెజిల్, జింబాబ్వేలో ఉత్పత్తి తగ్గింది. మనకు బ్రెజిల్, జింబాబ్వేలు ఎగుమతుల్లో ప్రధాన పోటీగా ఉన్నాయి. ఈ ఏడాది ఆయా దేశాల్లో కూడా పొగాకు ఉత్పత్తి బాగానే ఉందని చెబుతున్నారు. అలాగే రాష్ట్రంలో కూడా ఈ ఏడాది ఎక్కువ పంటను రైతులు పండించారు. ఎల్ఎల్ఎస్ పరిధిలోనూ నిర్దేశిత పంట కన్నా ఎక్కువగానే పండించారు.

వేలం కేంద్రం వారీగా ధరలు
(కిలోకు రూ.లలో)

వేలం కేంద్రం	గరిష్ట	కనిష్ట	సరాసరి
జంగారెడ్డిగూడెం–1	417	200	298.60
జంగారెడ్డిగూడెం–2	418	200	296.58
కొయ్యలగూడెం	418	200	296.38
గోపాలపురం	416	140	300.00
దేవరపల్లి	416	140	290.37

బీసీలకిచ్చిన హామీలు అమలు చేయాలి



కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇస్తున్న బీసీ సంక్షేమ సంఘ నాయకులు

భీమవరం: ఎన్నికల ముందు కూటమి నాయకులు బీసీ వర్గాలకు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ డిమాండ్ చేశారు. శుక్రవారం భీమవరం కలెక్టరేట్‌లో ఐదు ప్రధాన డిమాండ్లను అమలు చేయాలని బీసీ సంఘం నాయకులు వినతి పత్రం సమర్పించారు. కాశీ మాట్లాడుతూ చట్టసభల్లో 33 శాతం, స్థానిక సంస్థలు–నామినేటెడ్ పదవులు, నామినేషన్ పనుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. అయితే వీటిని నెరవేర్చకపోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే తరుణంలో ఇప్పటికీ రాష్ట్రంలో కులగణన నిర్వహించకుండా, స్థానిక ప్రాదేశిక నియోజక వర్గాల విభజన పూర్తి చేయకుండా, బీసీలకు రిజర్వేషన్లు ఎలా కల్పిస్తారని నిలదీశారు. ఏప్రిల్ తర్వాత ఆరు నెలల్లోపు ఎన్నికలు జరిగే అవకాశమున్నందున ఈలోపు కులగణన జరిపి ప్రాదేశిక నియోజక వర్గాల విభజన పూర్తి చేసి, బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ సబ్‌ప్లాన్ రూపొందించి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కొడవర్తి శివప్రసాద్, అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు నాగిడిపాలెం శ్యామ్, కేశవభట్ల విజయ్, అత్తిలి బాబి, సుధీర్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ నిర్మాణంపై రాద్ధాంతం తగదు



సమావేశంలో పాల్గొన్న వామపక్ష పార్టీల నాయకులు

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్‌ను ఎక్కడ నిర్మించాలనే దానిపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా లేనిపోని చర్చ, అనవసరమైన రాద్ధాంతం జరుగుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ విమర్శించారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో కలెక్టరేట్ సమస్యపై వామపక్షాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మూడేళ్ల కిందటే కలెక్టరేట్ నిర్మాణానికి భీమవరం మార్కెట్ యార్డులో 20 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసిందన్నారు. ఇది ఆమోదయోగ్యమైంది కావడంతో ఎవరూ అభ్యంతరం చెప్పలేదన్నారు. గతంలో ప్రకటించిన విధంగానే కలెక్టరేట్ నిర్మించాలని, దీనిలో భాగంగా ఈనెల 15న మార్కెట్ యార్డు స్థల పరిశీలనకు అందరూ రావాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ ప్రస్తుతం కలెక్టరేట్ నిర్మాణానికి సూచిస్తున్న ప్రాంతాలు అనువైనవి కాదన్నారు. ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంకా కృష్ణమూర్తి, ఎంసీపీఐయూ జిల్లా నాయకుడు జి.రాంబాబు మాట్లాడుతూ గతంలో కేటాయించిన విధంగానే కలెక్టరేట్‌ను మార్కెట్ యార్డులో నిర్మించాలన్నారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, సీపీఐ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, మల్లుల సీతారాంప్రసాద్, దండు శ్రీనివాసరాజు, బొక్కా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మమ అనిపించి.. మరింత అధ్వానంగా మార్చి..



'సాక్షి'లో ఈనెల 11న ప్రచురించిన 'చెరువులను తలపిస్తున్న గుంతలు' కథనానికి అధికారులు స్పందించారు. టి.నరసాపురం యూనియన్ బ్యాంకు ఎదురుగా రోడ్డుపై గుంతను గ్రావెల్‌తో పూడ్చారు. అయితే లోతైన గుంతను మెటల్‌తో పూడ్చాల్సి ఉండగా మెత్తని గ్రావెల్ వేయడంతో రహదారి మరింత అధ్వానంగా మారింది. శుక్రవారం ఆయిల్‌పామ్ గెలలతో వెళుతున్న లారీ ఇక్కడ ఒక్కసారిగా దిగబడిపోయింది. జేసీబీ, ఇతర లారీలతో బయటకు తీసేందుకు ప్రయత్నించినా ఇరుక్కున్న లారీ రాలేదు. చేసేది లేక రాత్రి లారీలో ఉన్న లోడును మరో లారీలోకి మార్చారు. గుంతలో దిగబడిన లారీ మరమ్మతులకు కూడా గురైంది. 'కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్టు' అన్న చందంగా పనులు ఉన్నాయని గ్రామస్తులు అంటున్నారు. – టి.నరసాపురం

ఆయుధ కర్మాగారం మాకొద్దు

ఏలూరు (టూటౌన్): ఆయుధ కర్మాగారం విషయంలో ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్ కలెక్టరేట్‌లో చేసిన ప్రకటనను సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ మేరకు జిల్లా కార్యదర్శి ఎ.రవి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెంలో నేవీ ఆయుధ డిపోను ఏర్పాటుచేస్తామని ఎంపీ ప్రకటించారని, అయితే ఈ పరిశ్రమ వద్దంటూ అక్కడి ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారని తెలిపారు. ఈ మేరకు మూడుసార్లు గ్రామసభ జరిగినా ప్రజలు తిరస్కరించారన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పీసా కమిటీ ఆధ్వర్యంలో జరిగే గ్రామసభ తిరస్కరించినప్పుడు దానిని కాదని పరిశ్రమ ఎలా పెడతారని ప్రశ్నించారు. ఆ సమయంలో ప్రజల మనోభావాలకు విరుద్ధంగా పరిశ్రమ పెట్టబోమని ఎంపీ ప్రకటించారని, అయితే ఇప్పుడు మళ్లీ మాట ఎందుకు మారుస్తున్నారని ప్రశ్నించారు. పరిశ్రమ ఏర్పాటుతో ఆ ప్రాంతంలో ఆరు గ్రామాలకు చెందిన మూడు వేల మంది నిర్వాసితులు అవుతారన్నారు. గత ప్రభుత్వంలో ఈ పరిశ్రమ ఏర్పాటును టీడీపీ, జనసేన పార్టీలు వ్యతిరేకించాయని గుర్తు చేశారు.

మూలనపడ్డ ఎన్‌హెచ్‌-165 పనులు



ఉప్పుటేరు గట్టు వద్ద అయిభీమవరం ప్రాంతంలో నిర్మించనున్న బైపాస్ వంతెన పనులు

ఆకివీడు: జాతీయ రహదారి-165 నిర్మాణంలో భాగంగా స్థానిక ఉప్పుటేరుపై నిర్మించనున్న వంతెన పనులు పూర్తిగా స్తంభించిపోయాయి. పామర్రు-ఆకివీడు, ఆకివీడు-దిగమర్రు జాతీయ రహదారి నిర్మాణానికి అడుగడుగునా అవాంతరాలతో కాలం గడిచిపోతుంది. పీపీ రోడ్డుగా ఉన్న ఈ రహదారిని 1999లో జాతీయ రహదారిగా గుర్తించి ఆ శాఖ విలీనం చేసుకుంది. అప్పటి నుంచి పాత రహదారి పునర్నిర్మాణ పనులు చేపట్టకపోయినా, తూట్లు పడ్డ ప్రాంతంలో మాట్లు వేసి ఎన్‌హెచ్‌ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ప్రజలు, ప్రయాణికులు జాతీయరహదారిగా గుర్తింపు పొందిన తరువాత కొత్త రోడ్డు వేస్తారు.. రోడ్డు విస్తరణ జరుగుతుందని ఎంతో ఆశపడ్డారు. చివరకు నిరాశే మిగిలింది. ప్రస్తుతం ఏలూరు జిల్లా పరిధిలో ఉన్న పామర్రు-ఆకివీడు ప్రాంతంలో రహదారి విస్తరణ, అభివృద్ధి పనులు వేగంగా జరుగుతూ చాలా వరకూ పనులు పూర్తి చేశారు.

ఏలూరు జిల్లా తాడినాడ ప్రాంతంలోని ఉప్పుటేరు గట్టు నుంచి, ఆకివీడు మండలంలోని అయిభీమవరం గుండా బైపాస్ వెళ్లేందుకు ఉప్పుటేరుపై వంతెన నిర్మాణ పనులు రెండేళ్ల క్రితమే ప్రారంభించారు. ఉప్పుటేరులో పిల్లర్ల నిర్మాణం వేగంగా చేపట్టారు. రెండు వేసవిలు పూర్తయిన తరువాత నిర్మాణ పనుల్ని అర్ధంతరంగా మూసివేశారు. ఎక్కడ పిల్లర్లు అక్కడే ఉప్పుటేరులో తుప్పుపట్టిపోతున్నాయి. పామర్రు-ఆకివీడు మధ్య ప్రాజెక్టు పనులలో భాగంగా ఈ వంతెన నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉందని చెబుతున్నారు. పిల్లర్లకు ఉన్న ఇనుప రాడ్లు తుప్పు పడుతుండటంతో వంతెన నిర్మాణానికి మళ్ళీ పిల్లర్లు వేయాలా అన్న సందేహం వ్యక్తమవుతోంది.

పాత రోడ్డుకు తెర

ఆకివీడు-దిగమర్రు మధ్య బైపాస్ రోడ్ల నిర్మాణంతో పాత రోడ్లు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడింది. బైపాస్ రోడ్లతో కలిపి 46 కిలోమీటర్ల మేర ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణానికి మొదట్లో రూ.1,200 కోట్లు, ఆ తరువాత రూ.2,400 కోట్లు, ప్రస్తుతం రూ.3,100 కోట్ల నిధులు కేటాయించారు. పాత అలైన్‌మెంట్ ప్రకారం ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణానికి అంచనా రూ.2,400 కోట్లతో ప్రతిపాదనలు ఆమోదించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కొత్త అలైన్‌మెంట్ ప్రకారం మరో రూ.700 కోట్లు అదనంగా కేటాయించారు.

పాత రోడ్డుకు మోక్షం కల్పించండి

జాతీయ రహదారి 165 పాత రోడ్డుకు మోక్షం కల్పించేలా ఆ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణం చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. బైపాస్‌తో కొత్త రోడ్డు నిర్మాణానికి మరో 10 ఏళ్లు పట్టినా ఆశ్చర్యపడాల్సిన అవసరంలేదని పలువురు పేర్కొంటున్నారు. పాతరోడ్డును నాలుగు లైన్లకు గానీ, కనీసం మూడు లైన్లకు గానీ విస్తరింపజేసి, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

త్వరగా నిర్మించాలి



జాతీయ రహదారి విస్తరణ, నిర్మాణ పనులు రెండు దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో ప్రతిపాదనల రూపంలోనే ఉండిపోయింది. ప్రభుత్వాలు మారినా, ప్రజా ప్రతినిధులు మారినా ఎన్‌హెచ్‌-165 రూపురేఖలు మారడంలేదు. ప్రస్తుతం ఉన్న రోడ్డును అభివృద్ధి చేయాలి.

– అంబటి రమేష్, ఆకివీడు

ఇరుకు రోడ్లతో సతమతం



జాతీయ రహదారి-165 అభివృద్ధి జరగకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాము. వాహనాల సంఖ్య పెరగడంతో ట్రాఫిక్ పెరిగిపోతుంది. జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా త్వరితగతిని అభివృద్ధి చేయాలి. బైపాస్ రోడ్లకు పనుల్ని వేగవంతం చేయాలి. నిత్యం ట్రాఫిక్‌తో సతమతమవుతున్నాం.

– కె.లాజరు, కుముదవల్లి, పాలకోడేరు మండలం

రోడ్డు ప్రమాదంలో వీఆర్వో మృతి



రామకృష్ణ ప్రసాద్ (ఫైల్)

గణపవరం (నిడమర్రు): పిప్పర గ్రామంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్.కొండేపాడు వీఆర్వో అడబాల రామకృష్ణ ప్రసాద్ మృతిచెందారు. గణపవరం ఎస్సై మణికుమార్ తెలిపిన వివరాల ప్రకారం రామకృష్ణ ప్రసాద్ స్వగ్రామం వీరేశ్వరపురం నుంచి విధుల నిమిత్తం ఎస్.కొండేపాడు వెళ్తుండగా.. మధ్యలో పిప్పరలోని రాజ్ కళ్యాణ మండపం వద్ద వ్యాన్ వెనక నుంచి ఢీకొనడంతో ప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసి తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. తహసీల్దారు అప్పారావు, కార్యాలయం సిబ్బంది వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కాలువలో మృతదేహం లభ్యం

దెందులూరు: గోదావరి కాలువలో దెందులూరు మండలం సత్యనారాయణపురం వద్ద మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని గమనించిన గ్రామస్తులు దెందులూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి చేతి మీద సత్య అని రాసి ఉందని 40 సంవత్సరాలు వయసు ఉంటుందని ఎస్సై ఆర్.శివాజీ తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన బయన్నగూడెం జెడ్పీ స్కూల్ విద్యార్థులు

కొయ్యలగూడెం: జిల్లా స్థాయిలో నిర్వహించిన ఫుట్‌బాల్, సెపక్‌తక్రా పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు విద్యాసంస్థల ప్రతినిధులు శుక్రవారం పేర్కొన్నారు. ఈనెల 11న పెదవేగిలో నిర్వహించిన ఫుట్‌బాల్ అండర్-19 విభాగంలో పదో తరగతి చదువుతున్న కోమటి గుంట మనోజ్ కుమార్, రామని బాలాజీ, గుర్రం వెంకటలక్ష్మి ప్రతిభ చూపి ఆకట్టుకున్నారన్నారని ప్రధానోపాధ్యాయుడు కె.రవికుమార్ తెలిపారు. దీంతో వీరిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారని తెలిపారు. అదేవిధంగా కొయ్యలగూడెం వీఎస్ఎన్ కళాశాలలో ఇంటర్ అభ్యసిస్తున్న పాక దుర్గా మధుర శ్రీ జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని సెపక్‌తక్రా విభాగంలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది ఈ సందర్భంగా విద్యార్థులను ఎస్ఎంసి చైర్మన్ కోడి నాగలక్ష్మి, పీఈటి సురేష్ అభినందించారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు హేమంత్ కుమార్



హేమంత్ కుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సెకండియర్ విద్యార్థి హేమంత్ కుమార్ ఏలూరులో జరిగిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అండర్-19 బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో ప్రథమ స్థానంలో నిలిచాడు. దీంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హేమంత్ కుమార్, వ్యాయామ అధ్యాపకుడు మాణిక్యం రాజాను ప్రిన్సిపాల్ నాగవేణి, అధ్యాపక బృందం అభినందించారు.

అక్టోబర్ 12న చెస్ పోటీలు

భీమవరం: తెలుగు రాష్ట్రాల ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు అక్టోబర్ 12న భీమవరంలో నిర్వహించనున్నట్టు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్ల ఆవిష్కరణ శుక్రవారం నిర్వహించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు విజేతలకు రూ.లక్ష నగదు బహుమతులు, క్రీడాకారులకు ఉచిత భోజన సదుపాయం కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఎన్‌సీసీ ఫైరింగ్ సెలక్షన్ క్యాంప్

తాడేపల్లిగూడెం: ఎన్‌సీసీ బెటాలియన్ ఆధ్వర్యంలో ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలకు సంబంధించి ఐజీసీఆర్‌డీసీ సెలక్షన్ క్యాంపు కమాండెంటు కల్నల్ అమిత్ పాండే ఆధ్వర్యంలో శుక్రవారం వరకు నిర్వహించారు. ఈ శిబిరంలో డ్రిల్ ఫైరింగ్, కల్చరల్ ఫ్లాగ్ విభాగాల్లో పరీక్షలు నిర్వహించారు. ఇక్కడ ఎంపికైన వారు గుంటూరులో జరగనున్న క్యాంపులో పాల్గొంటారు.

9 లక్షల టన్నుల ధాన్యం లక్ష్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రస్తుత ఖరీఫ్‌లో రైతుల నుంచి ధాన్యం సేకరణకు లక్ష్యాలను నిర్దేశించినట్టు జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కాకినాడలో శుక్రవారం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల అధికారుల సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ విషయం వెల్లడించారని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో 5 లక్షలు, ఏలూరు జిల్లాలో 4 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యమన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి తదితరులు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని సంబంధిత అధికారులకు ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి ఆదేశించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 13న లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. శుక్రవారం జిల్లా న్యాయమూర్తి చాంబరులో మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 34 లోక్ అదాలత్ బెంచ్‌లు ఏర్పాటు చేశామని, మండల న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించి ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ లోక్ అదాలత్‌లో 4,802 పెండింగ్ కేసులను రాజీయోగ్యంగా గుర్తించామని, 2,225 ప్రీ లిటిగేషన్ కేసులను గుర్తించామని చెప్పారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంటు కొనె సీతారాం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేజీ ఉల్లి రూ.12



గూడెం మార్కెట్‌కు వచ్చిన కర్నూలు ఉల్లిపాయలు

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం మార్కెట్‌కు శుక్రవారం వచ్చిన కర్నూలు రకం ఉల్లిపాయలకు వ్యాపారులు నిర్వహించిన వేలంలో కనీస ధర కేజీ రూ.8, గరిష్ఠ ధర రూ.12 పలికింది. మొత్తం తొమ్మిది లారీల ఉల్లిపాయలు రాగా, ఎనిమిది లారీల సరకును ఎగుమతిదారులు కొనుగోలు చేశారు. గత కొంతకాలంగా ఉల్లి ధర పడిపోతుండగా.. శుక్రవారం వేలంలో కనీస ధర లభించడంతో రైతుల ముఖంలో ఆనందం కనిపించింది.

ప్రింటింగ్ రంగాన్ని పరిశ్రమగా గుర్తించాలి

పాలకొల్లు సెంట్రల్: ప్రింటింగ్ రంగాన్ని పరిశ్రమగా గుర్తించాలని ప్రింటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.బసవయ్య కోరారు. పాలకొల్లులో శుక్రవారం రాష్ట్ర ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో ప్రింటింగ్ పరిశ్రమ సేవా రంగంలో ఉండడంతో పలు ప్రయోజనాలు కోల్పోతోందన్నారు. మారుతున్న టెక్నాలజీ చిన్న ప్రింటింగ్ ప్రెస్‌లకు సవాలుగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ జిల్లాలోని ప్రింటింగ్ పనులు ఆ జిల్లాలోని వారికే ఇవ్వడానికి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలు చేసి ఆమోదించారు. క్లస్టర్స్ ప్రోగ్రాం నేషనల్ కన్సల్టెంట్ ఈడ్పుగంటి ఫణిపూర్ణచంద్రరావు, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, కోశాధికారి ఎస్.శ్రీనివాస్, పాలకొల్లు అసోసియేషన్ తరపున ముత్యాల రామారావు, కాగిత సూర్యనారాయణ, కె.ఎస్. శ్రీనివాసకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలి

ఏలూరు (టూటౌన్): వరి కోతలు ప్రారంభానికి ముందే కొనుగోలు కేంద్రాలు తెరచి కొనుగోళ్లకు సిద్ధం చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. శుక్రవారం కాకినాడలో పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌కు సంఘం సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ తదితరులు వినతిపత్రం అందజేశారు. పండించిన పంటలో 60 శాతం మాత్రమే కొనుగోలు లక్ష్యంగా ప్రకటించడం వల్ల మిగిలిన పంటను దళారులకు, వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. 50 శాతం సబ్సిడీపై టార్పాలిన్లు అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించాలన్నారు. కల్లాల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు.

22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

- ఈసారి 11 రోజుల పాటు వేడుకలు
- ముస్తాబవుతున్న క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ ఆలయం
- రోజుకో అలంకారంలో దర్శనమివ్వనున్న అమ్మవారు



విశేష అలంకారాల్లో ఉన్న కుంకుళ్లమ్మ అమ్మవారు



ద్వారకాతిరుమలలో క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ అమ్మ ఆలయం



ఆలయం వద్ద అమ్మవారి భారీ విద్యుత్ కటౌట్ నిర్మాణ పనులు

ద్వారకాతిరుమల: ఏటా తొమ్మిది రోజుల పాటు ఘనంగా జరిగే శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ ఏడు 11 రోజుల పాటు జరగనున్నాయి. అందులో భాగంగా ఈనెల 22 నుంచి వచ్చేనెల 2 వరకు జరగనున్న ఉత్సవాలను పురస్కరించుకుని ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయానికి ఉపాలయమైన, క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ప్రస్తుతం విద్యుద్దీప అలంకారాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రహదారికి ఇరువైపులా విద్యుత్ తోరణాలు అమర్చుతున్నారు. ఆలయం వద్ద అమ్మవారి భారీ విద్యుత్ కటౌట్ నిర్మిస్తున్నారు. ఉత్సవాలు జరిగే రోజుల్లో అమ్మవారు రోజుకో ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు.

అలంకారాలు ఇవీ..

దసరా ఉత్సవాలు సందర్భంగా అమ్మవారు ఈనెల 22న శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవిగా, 23 న శ్రీ గాయత్రీ దేవిగా, 24 న శ్రీ అన్నపూర్ణా దేవిగా, 25 న శ్రీ కాత్యాయని దేవిగా, 26న శ్రీ మహాలక్ష్మి దేవిగా, 27న లలితా త్రిపుర సుందరీ దేవిగా, 28న మహాచండీగా, 29 న శ్రీ సరస్వతీ దేవిగా(మూలానక్షత్రం), 30 న శ్రీ దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. అలాగే వచ్చేనెల 1న మహిషాసురమర్దినిగా, ఉత్సవాల ముగింపు రోజైన(దసరా పండుగ) 2న శ్రీ రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారు భక్తులను కటాక్షిస్తారని తెలిపారు. అదేరోజు సాయంత్రం క్షేత్రంలో అమ్మవారి రథోత్సవం, 3న దీక్షాధారుల ఇరుముడి సమర్పణ, చండీహోమాన్ని నేత్రపర్వంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. 4న ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహిస్తామని తెలిపారు. ద్వారకాతిరుమలకు కిలోమీటరు దూరంలో ఉన్న ఈ కుంకుళ్లమ్మ అమ్మవారి క్షేత్రానికి వచ్చే భక్తులకు యాత్రలో కష్టనష్టాలు కలుగనివ్వరని భక్తుల నమ్మకం. అందుకే శ్రీవారిని దర్శించిన అనంతరం భక్తులు తిరుగు ప్రయాణంలో తప్పనిసరిగా ఈ అమ్మవారిని దర్శిస్తారు.

ఈ ఏడాది ప్రత్యేకం

శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ ఏడాది 11 రోజులు రావడం విశేషం. తిథుల్లో హెచ్చుతగ్గులు రావడమే ఇందుకు కారణం. ఉత్సవాలు జరిగే రోజుల్లో విజయవాడ దుర్గమ్మ ఏ రోజు ఏ అలంకారంలో దర్శనమిస్తారో, ఇక్కడ కుంకుళ్లమ్మ అమ్మవారు కూడా అదే అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు.

– భైరవ స్వామి, కుంకుళ్లమ్మ ఆలయ ప్రధానార్చకుడు, ద్వారకాతిరుమల

యాజమాన్య పద్ధతులు పాటించాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ కె.ఫణికుమార్

పోలవరం రూరల్: యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా వరిలో ఆశించే ఎండాకు తెగులు, ఉల్లికోడు, ఆకునల్లి తెగుళ్లను నివారించవచ్చని ఏలూరు జిల్లా ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కె.ఫణి కుమార్ అన్నారు. గూటాల, కొత్త పట్టిసీమ రైతులకు వరి పొలంలో ఆశించే ఎండాకు తెగులు, ఉల్లికోడు, ఆకు నల్లిపై రైతులకు అవగాహన కార్యక్రమం గూటాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో ఆశించే ఎండాకు తెగులు నత్రజని ఎరువులు అధికంగా వాడడం వల్ల, వాతావరణ పరిస్థితులు వల్ల ఆశిస్తుందన్నారు. నత్రజని ఎరువులు వాడకాన్ని తక్కువ మోతాదులో వాడటం- పోటాష్ ఎరువును అధిక మోతాదులో వాడుకుంటే ఈ ఎండాకు తెగులు కొంతవరకు అరికట్టవచ్చన్నారు. మురికి నీటిని ఎప్పటికప్పుడు తీస్తూ కాలువలో ఉన్న నీరుని ఎప్పటికప్పుడు చేల్లో పెట్టుకుంటూ ఉండాలన్నారు. ఎండాకు తెగులు ఆశించిన పొలాల్లో కాప్రాక్సీ క్లోరైడ్ రెండు గ్రాములు లీటరు నీటికి, లేదా ప్లాంటు మైసనోగ్రామ్ లీటరు నీటికి కలిపి చేనంతా తడిచేలా పిచికారీ చేయాలన్నారు. వరి దుబ్బుకు రెండు కన్నా ఎక్కువగా ఉల్లికోడు ఉన్నట్లయితే నివారణ చర్యలు చేపట్టుకోవాలన్నారు. పెప్రోనిల్ 2 ఎంఎల్ లీటరు నీటికి లేదా క్లోరోపైరిపాస్ 2.5 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ముదురునారు నాటడం వల్ల ఉల్లికోడు ఎక్కువగా ఆశించే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లీటరు నీటికి లేదా డైకో ఫాలో 5 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు.

ఇద్దరు పిల్లలు సహా తల్లి అదృశ్యం

ముదినేపల్లి రూరల్: ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యంపై ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ముదినేపల్లికి చెందిన బొర్రా కుసుమ భర్త పున్నారావు రెండేళ్ల క్రితం మరణించాడు. కుసుమ అప్పటి నుంచి ముదినేపల్లిలో తండ్రి ఇంటి వద్దే ఉంటోంది. కుసుమకు ఇద్దరు పిల్లలు. ఈ నెల 11న డ్వాక్రా గ్రూపు వాయిదా చెల్లించేందుకు మచిలీపట్నంలోని అత్తగారింటికి వెళ్లింది. అదే రోజు తిరిగి సాయంత్రం ముదినేపల్లి వచ్చింది. ఇద్దరు కుమారులు పాఠశాల నుంచి రాగానే తమ బంధువులకు యాక్సిడెంట్ జరిగిందని పొరుగూరు వెళ్తున్నానని, తల్లిదండ్రులకు ఈ విషయం చెప్పాలని పొరుగింట్లో చెప్పి పిల్లలతో సహా వెళ్లిపోయింది. తండ్రి బంధువులను ఆరా తీయగా ఎవరూ ఆచూకీ తెలపకపోవడంతో స్టేషన్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు నృత్య అవార్డుల ప్రదానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన నటరాజ నాట్య కళాకేంద్రం, కళాదీపిక నృత్య అకాడమీ, శ్రీశ్రీ కల్చరల్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 13న 12వ జాతీయ స్థాయి నృత్య అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు ఎన్.రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో నృత్య రంగానికి విశేష కృషి చేసిన గురువులు జీ చైతన్య, నీలమ్ ముత్యాలు, కే ప్రశాంత్ కుమార్, కే ఖ్యాతీశ్వరి, జీవీఎస్ఎల్ లాస్య, ఎం.అనూష బహదూర్, బీ శారద, కే రమేష్ నాయుడు, ప్రసాద్, టీ దివ్య సుహాసిని, ఐ సాయి నవ్యశ్రీలకు నాట్య విధాత అవార్డులు ప్రదానం చేయనున్నారు. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఉదయం 9.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

రైలు కిందపడి బాలిక మృతి



చికిత్స పొందుతూ మృతిచెందిన శిరీష

భీమవరం: తల్లిదండ్రులు మందలించారని రైలుకింద పడి బాలిక ఆత్మహత్య చేసుకున్నట్లు భీమవరం రైల్వే ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం చెప్పారు. భీమవరం రూరల్ మండలం చినఅమిరం గ్రామానికి చెందిన మద్దాల శిరీష(17) ఇంటర్ చదువుతోంది. సక్రమంగా చదవడం లేదని తల్లిదండ్రులు మందలించడంతో గురువారం రాత్రి నరసాపురం నుంచి లింగంపల్లి వెళ్లుతున్న రైలుకిందపడి తీవ్రంగా గాయపడింది. లోకోపైలెట్ గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు.

వట్లూరు రైల్వే స్టేషన్ సమీపంలో మృతదేహం

ఏలూరు టౌన్: ఏలూరు శివారు వట్లూరు రైల్వేస్టేషన్ సమీపంలో వ్యక్తి మృతదేహం గుర్తించారు. రైల్వే పోలీసులు వివరాల ప్రకారం.. పెద్ద రైల్వేస్టేషన్ పరిధిలోని వట్లూరు రైల్వే స్టేషన్ సమీపంలో ట్రాక్ పక్కనే గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తించారు. మృతుడు శరీరం 40 శాతానికి పైగా కుళ్ళిన స్థితిలో ఉంది. మృతదేహంపై ఆరంజ్ రంగు షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ఉంది. వయస్సు సుమారు 40 నుంచి 45 ఏళ్ళ మధ్య ఉంటుందని అంచనా. మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

సంపద లేని కేంద్రాలు

- దిష్టిబొమ్మల్లా సంపద తయారీ కేంద్రాలు
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ఉత్తిదే!
- గ్రామాల్లో చెత్త కుప్పలు దర్శనం
- పంచాయతీల ఆదాయానికి గండి


ఇరగవరంలో నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం

ఇరగవరం: గ్రామాల పరిశుభ్రతతో పాటు ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి చెత్త సంపద కేంద్రాలను నిర్మించింది. చెత్తను వేరు చేసి ఎరువులుగా తయారు చేసి వాటి ద్వారా వచ్చే ఆదాయం పంచాయతీలను అభివృద్ధి చేయాల్సి ఉంది. అయితే ఈ మహోన్నత ఆశయం కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా కారణంగా నీరుగారిపోతుంది. ప్రభుత్వం ప్రతినెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. అయితే ఆ ఒక్కరోజు మాత్రమే తూతూ మంత్రంగా కార్యక్రమాన్ని చేపట్టి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. గ్రామాల్లో చెత్తసేకరణ సైతం సక్రమంగా జరగడం లేదు. దీంతో చెత్త సేకరణ కేంద్రాలు కూడా మరుగునపడ్డాయి.

కొరవడిన పర్యవేక్షణ

గ్రామాల్లో ఇంటింటా వ్యర్థాలు సేకరించేందుకు హరిత రాయబారులను నియమించి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. చెత్త సంపద కేంద్రాలపై జిల్లా స్థాయి అధికారులతో పాటు డివిజన్, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఇరగవరం మండలంలో 21 గ్రామాల్లో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన సంపద కేంద్రాలు సగంపైగా గ్రామాల్లో నిరుపయోగంగా మారాయి.


సంపద తయారీ కేంద్రంలో ఖాళీగా దర్శనమిస్తున్న తొట్లు


ఇరగవరంలో రోడ్డు పక్కన చెత్తను తగలబెడుతున్న దృశ్యం

ప్రతి ఊరిలో ఎక్కడ పడితే అక్కడ రహదారుల పక్కన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్తను ఎక్కడికీ తరలించకుండా చెత్తకు నిప్పు పెట్టి చేతులు దులిపేసుకుంటున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా

లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారడంతో గ్రామాల్లో మందులు బాబులకు అవాసాలుగా మారాయి. గ్రామాలకు దూరంగా ఉండటంతో అసాంఘిక కార్యక్రలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. కొన్ని చోట్ల అధికారులు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఒక్కో కేంద్రానికి సుమారు రు.3.50 లక్షల నుంచి రూ.5లక్షల వరకు వెచ్చించి నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటి నిర్వహణపై చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయా గ్రామాల సర్పంచ్‌లు కోరుతున్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పర్యవేక్షించాలని, చెత్త నుంచి ఆదాయం పెంచుకొని ఆ మొత్తాన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధికి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో పక్కాగా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చెత్త సంపద తయారీ కేంద్రాలకు చేరిన వ్యర్థాలను తడి, పొడి వేరుచేసి వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేసేవారు. దీన్ని కిలో రూ.10నుంచి రూ.30వరకు రైతులకు విక్రయించి పంచాయతీలకు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకొనేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక సంపద కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడి లక్ష్యం నీరుగారిపోయింది. ఇప్పటికైనా లక్షల వ్యయంతో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకొస్తే పంచాయతీలకు ఉపయోగకరంగా ఉంటుంది.

వినియోగంలోకి తీసుకురావాలి



చెత్త నుంచి సంపద తయారు చేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం షెడ్లను నిర్మించింది. అయితే ఇప్పుడు అని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ప్రభుత్వం చొరవ తీసుకొని వర్మీకంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయిస్తే ఆదాయం సమకురుతుంది.

– మంగిన రామానాయుడు, ఎంపీటీసీ, ఇరగవరం

చర్యలు తీసుకుంటాం



ఇరగవరం మండలంలోని అన్ని గ్రామాల్లో సంపద తయారీ కేంద్రలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. చెత్త బండ్లు, రిక్షాలు, ఆటోలుతో చెత్తను సంద తయారీ కేంద్రాలకు తరలించడం జరుగుతుంది. కొన్ని గ్రామాల్లో వర్మీ ఉత్పత్తి అవుతుంది. చెత్తను తడి, పొడిగా వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులుకు ఇవ్వడంలో ప్రజలకు భాగస్వామ్యం ఉంటుంది. ప్రజలు చెత్త, ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అధికారులకు ప్రజలు సహకరించాలి.

– నరసింహ మూర్తి, ఇరగవరం ఈవోపీఆర్డీ

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


ఆర్టీసీ డిపో మేనేజర్ పి.దానమ్మకు అభినందనలు చెబుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పి.దానమ్మ పదవి బాధ్యతులు స్వీకరించారు. దానమ్మ తొలుత అసిస్టెంట్ మేనేజర్‌గా తాడేపల్లిగూడెంలోను, ప్రమోషన్లపై కర్నూలు, నంద్యాలలో ఏటీఎం కమర్షియల మేనేజర్‌గాను, అనంతరం రాజోలు డిపో మేనేజర్‌గా పనిచేశారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, డిపో సిబ్బంది, వివిధ యూనియన్ల నాయకులు, సభ్యులు దానమ్మకు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

ఏఐఎస్‌ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అప్పలస్వామి



తణుకు అర్బన్: ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ (ఏఐఎస్‌ఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తణుకుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన టి.అప్పలస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పటివరకు జిల్లా కార్యదర్శిగా కొనసాగిన తనకు రాష్ట్ర పదవి దక్కినట్లుగా అప్పలస్వామి తెలిపారు. ఈనెల 11వ తేదీన విజయవాడ ఎంబీకే భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లో భాగంగా భవిష్యత్ ఉద్యమ కార్యచరణతోపాటు ఏఐఎస్‌ఏ రాష్ట్ర నూతన కమిటీని 19 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని, ఇందులో రాష్ట్ర ఆఫీస్ బేరర్‌గా 8 మందిని ఎన్నుకున్నారని చెప్పారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలను కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

రెడ్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఆర్‌సీడీఎస్ నాయకులు

పెంటపాడు: రాష్ట్రంలో రెడ్ల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రత్యేక వెల్ఫేర్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని జిల్లా రెడ్డి కమ్యూనిటీ డవలప్‌మెంట్ సొసైటీ (ఆర్సీడీఎస్) జిల్లా అధ్యక్షుడు కర్రి శ్రీనివాసరెడ్డి కూటమి ప్రభుత్వాన్ని కోరారు. పెంటపాడులో మాజీ ఎంపీటీసీ సభ్యురాలి నివాసంలో శుక్రవారం ఆయన ఆర్‌సీడీఎస్ జిల్లా నాయకులతో కలిసి మాట్లాడారు. ఏపీలో సుమారు 60 లక్షలకు పైగా రెడ్డి సంఘ సభ్యులు ఉన్నప్పటికి కూటమి ప్రభుత్వం వారిని పట్టించుకోలేదన్నారు. పంటలకు రుణాలు, విద్యార్థులకు ఉపకారవేతనాలు, కుటీరపరిశ్రమకు రుణాలు అందిస్తే తమ కమ్యూనిటీ అభివృద్ధితో పాటు, రాష్ట్ర ప్రగతికి మేలు జరుగుతుందన్నారు. ఈ విషయంపై ఈనెల 20 నుంచి ఆర్‌సీడీఎస్ తరపున అధికారులకు వినతి పత్రాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రెడ్డి కులస్తులు పార్టీలకు అతీతంగా విజయవంతం చేయాలని కోరారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు పోతంశెట్టి లక్ష్మి, జిల్లా కార్యదర్శి కర్రి సురేష్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. లక్ష్మీనారాయణరెడ్డి, కోశాధికారి వెలగల లింగారెడ్డి, జి. శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి పోరాటాలు స్ఫూర్తిదాయకం


ఏచూరికి చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సీతారాం ఏచూరి అని పలువురు సీపీఎం నాయకులు నివాళులర్పించారు. ఏచూరి వర్ధంతి సందర్భంగా స్థానిక బ్రహ్మానంద రెడ్డి ఉల్లిపాయల మార్కెట్ యూనియన్ కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యూనియన్ అధ్యక్షుడు చల్లా చంద్రరావు, నాయకులు సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డిలు మాట్లాడుతూ సీతారాం ఏచూరి జీవిత విశేషాలను వెల్లడించారు. ఆయన చేసిన పోరాటాలను, సాధించిన విజయాలతో కార్మికుల్లో స్ఫూర్తి నింపారు. పి.దుర్గా, కె.వెంకట్రావు, సత్యనారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

నానో యూరియాపై అవగాహన

కాళ్ల: నానో యూరియాను పంట ఆకులపై పిచికారీ చేయడం ద్వారా మొక్కల పత్రహరితానికి నేరుగా చేరుతుందని కాళ్ల మండల వ్యవసాయ అధికారి పి.రమేష్ నాయుడు తెలిపారు. మండలంలోని కోపల్లె గ్రామంలో నానో యూరియాపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 కిలోల బస్తాలో ఉండే పోషకాలు అరలీటర్ నానో యూరియాలో ఉంటాయన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


సబ్‌యూనిట్ పరిధిలో అవగాహన ర్యాలీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీజనల్ వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా సహాయ మలేరియా అధికారి వై.నాగబాబు తెలిపారు. స్థానిక ఎన్‌టీఆర్ జంక్షన్ హెల్త్ సెంటర్ పరిధిలో సాలిపేటలో శుక్రవారం జరుగుతున్న డ్రై డే, ఫ్రైడే కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. నాగబాబు మాట్లాడుతూ దోమలు ద్వారా సంక్రమించు వ్యాధులపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని, మలేరియా, చికెన్ గునియా వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఏరియా ఆసుపత్రి పీహెచ్‌సీ పరిధిలో ల్యాబ్, పెంటపాడు పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న డ్రై డే కార్యక్రమాలను పరిశీలించారు. సబ్ యూనిట్ అధికారి ఎస్‌వీఎస్ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్లు కాంతారావు, సురేష్, తేజోనంద, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

బార్ల దరఖాస్తులకు గడువు పెంపు

తణుకు అర్బన్: బార్ల నిర్వహణ కోసం దరఖాస్తు చేయుటకు ఈ నెల 16వ తేదీ వరకు గడువు పెంచినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ తణుకు శాఖ సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. ముందుగా ప్రకటించిన ప్రకారం ఈనెల 14వ తేదీకి గడువు ముగియాల్సి ఉండగా అదనంగా మరొక రెండు రోజులు పొడిగించి ఈనెల 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు ముగుస్తుందని చెప్పారు. 17వ తేదీన ఉదయం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆధ్వర్యంలో భీమవరంలో డ్రా తీయబడునని వివరించారు. దరఖాస్తుదారులు గమనించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు చేపడతాం

సచివాలయ ఉద్యోగుల హెచ్చరిక


కమీషనర్ ఏసుబాబుకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు చేపడతామని సచివాలయ ఉద్యోగులు మున్సిపల్ కమీషనర్ ఏసుబాబుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగులుగా తాము రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేస్తున్నామన్నారు. ఉద్యోగులుగా ప్రతి సారి ఇంటింటికి తిరిగి విధులు నిర్వహించడం వల్ల క్షేత్రస్థాయిలో తీవ్ర అవమానాలకు గురి అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటింటికి తిరిగి నిర్వహించే సర్వేలను విముక్తి ప్రసాదించాలని, ఉద్యోగులను మాతృశాఖలకు అప్పగించాలని, ఒత్తిడి లేని విధులు చేసే విధంగా చూడాలని, వీడియో కాన్ఫరెన్స్‌లకు దూరంగా ఉంచాలని, సెలవులు, పండుగలు, ఆదివారాలలో బలవంతంగా విధులు చేయించకూడదన్నారు. స్పెషల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, రికార్డు అసిస్టెంట్ క్యాడర్‌ను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌గా మార్పు చేయాలని, ప్రమోషన్స్ ఇవ్వాలని, సీనియార్టీ ఆధారంగా పారదర్శక బదిలీలు చేయాలన్నారు. 15 రోజులలోపు తమ సమస్యలు పరిష్కారం కాకపోతే ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆందోళనలు, నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

ఇంకా తేలని ఉద్యాన వీసీ పంచాయితీ

మంత్రి వద్ద ఫైల్ పెండింగ్

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ నియామకం పంచాయితీ ఇంకా ఒక కొలిక్కి రాలేదు. ఇంతకు ముందు వీసీగా ఉన్న డాక్టర్ కె.గోపాల్ తనని వీసీగా కొనసాగించమని హైకోర్టులో రిట్‌పిటిషన్ వేసిన సంగతి విధితమే. దీనిపై జరిగిన మధ్యంతర వాదనల అనంతరం విషయానికి గురువారం శుభం కార్డు పడుతుందని ఆశించారు. కాని మళ్లీ విషయం కోర్టులో వాయిదా పడింది. అంతకు మునుపు రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడున్న రిజిస్ట్రార్‌కు ఉద్యానవర్సిటీలో తాత్కాలిక వీసీగా ఎంపిక చేయడానికి వీలుగా సీనియర్ల జాబితాను పంపించాల్సిందిగా లేఖను పంపింది. దీంతో సుబ్రహ్మణ్యం, ప్రసన్నకుమార్, గోవిందరాజులు అనే ప్రొఫెసర్ల పేరును ప్రభుత్వానికి పంపించారు. వీటికి సంబంధించి చీఫ్ సెక్రటరీ పర్యవేక్షణలో సీనియర్ల గురించి సమాచారం సేకరించడంతో, న్యాయ పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకొని, పేర్లను ఓకే చేస్తూ ఫైల్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి వద్దకు పంపించినట్టు సమాచారం. అయ్యితే ఫైల్ ప్రస్తుతం సదరు మంత్రి పేషీలోనే ఉన్నట్టుగా తెలుస్తుంది. ఈ ఫైల్ సీఎం వద్దకు చేరి, ముగ్గురిలో ఒకరికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన తర్వాత ఆ ప్రొఫెసర్ ఉద్యానవర్సిటీ తాత్కాలిక వీసీగా రానున్నారు. ముగ్గురు సీనియర్లలో చూస్తే సుబ్రహ్మణ్యం ఉద్యోగ కాలం ఇంకా నాలుగు నెలలు మాత్రమే ఉంది. నాలుగు నెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్న వ్యక్తిని తాత్కాలిక వీసీగా ఏవైనా ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటేనే గాని ఆయనను నియమించే అవకాశాలు తక్కువ ఉన్నట్టుగా చెబుతున్నారు. ఆయన తర్వాత ఉన్న ప్రసన్నకుమార్, గోవిందరాజులుకు ఇంకా ఉద్యోగ విరమణ కాలం ఉంది. ఈ ఇద్దరు గతంలో ఉద్యానవర్సిటీలో వెంకట్రామన్నగూడెంలో పోస్టు హార్వెస్టు టెక్నాలజీ విభాగంలో ప్రసన్నకుమార్, విస్తరణ సంచాలకులుగా గోవిందరాజులు పనిచేశారు. ప్రస్తుతం ఈ ఇద్దరు వెంకట్రామన్నగూడెంలోనే పని చేస్తున్నారు. వీసీగా అవకాశం ఎవ్వరికి వస్తుందనే విషయం ఇంకా చర్చనీయాంశంగా ఉంది.

విద్యార్థుల ఉన్నతికి అధ్యాపకులు కృషి చేయాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రభాకర్‌రావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థుల ఉన్నతికి అధ్యాపకులు విశేష కృషి చేయాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి ప్రభాకర్‌రావు సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న రసాయన శాస్త్ర అధ్యాపకులకు ఒక రోజు శిక్షణ తరగతులు శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ప్రభాకర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో పెనుమార్పులు వస్తున్నాయని, వాటికి అనుగుణంగా ఉపాధ్యాయులు మార్పు చెందాలని, విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. అధ్యాపకులు మారిన పుస్తకాలకు అనుగుణంగా విద్యా బోధన చేయాలని, విద్యార్థులను చైతన్య వంతులను చేయాలన్నారు. నిట్, ఎంసెట్ వంటి వాటిపై శిక్షణ ఇప్పించాలని సూచించారు. ఈ ఏడాది జరగబోవు పరీక్షలల్లో నూటికి నూరుశాతం తెచ్చేందుకు ఉపాధ్యాయులు కృషి ఎంతో అవసరం అన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగవేణి, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలి


మాట్లాడుతున్న కౌరు పెద్దిరాజు

నరసాపురం రూరల్: విద్యుత్ చార్జీలను మరింత పెంచే స్మార్ట్ మీటర్లను ప్రజలంతా తిరస్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం లక్ష్మణేశ్వరం గ్రామంలో ఆ పార్టీ సభ్యులకు నిర్వహించిన మండల స్థాయి శిక్షణ తరగతులలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ సంస్కరణలు ప్రవేశపెట్టి ప్రజలపై మోయలేని భారాన్ని వేశారని అన్నారు. ఇప్పటికే ఇందన సర్దుబాటు చార్జీలు,ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.15,485 కోట్ల మేర విద్యుత్ బిల్లులు పెంచారని విమర్శించారు. మళ్లీ స్మార్ట్ మీటర్లు బిగించి విద్యుత్ చార్జీలు మరింత పెంచే ప్రయత్నం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో విద్య, వైద్యం సామాన్య ప్రజలకు కొంతమేరకు అందుబాటులో ఉండేవని ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల విద్య,వైద్యం వ్యాపార సరుకులుగా మారిపోయాయన్నారు. శిక్షణా తరగతులకు సీపీఎం మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు గుబ్బల నాగేశ్వరరావు, బొక్క శ్రీనివాసరావు, కడలి నాగరాజు, సట్టేటి సుబ్రహ్మణ్యం, పిల్లి కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


తణుకులో నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

తణుకు అర్బన్ : ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఆధ్వర్యంలో నిరసనవారంలో భాగంగా రెండవ రోజైన శుక్రవారం మండల కేంద్రం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.రామమోహన్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేయాలని, మెమో 57ను తక్షణం అమలు చేయాలని, 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలని, అన్ని రకాల బకాయిలు చెల్లింపులు చేయాలని, ఈహెచ్ఎస్ పరిమితిని రూ. 25 లక్షలకు పెంచాలని, యాప్‌లు, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాలను రద్దుచేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.సోమేశ్వరరావు, వై. ఏడుకొండలు, వి.భాస్కరరావు, కె.పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర పనుల నుంచి మినహాయించండి


తాడేపల్లిగూడెం(టీఓసీ): తహసీల్దార్ ఆఫీస్‌లో వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మూల్యాంకన పద్ధతిలో ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన మార్పులను ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం నిరసనవారం కార్యక్రమంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్న రాష్ట్ర ప్రభుత్వ, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు కరువు భత్యాలను విడుదల చేయాలని, 12వ పీఆర్‌సీ ప్రకటించాలని, మధ్యంతర భృతిని 30 శాతం ప్రకటించాలని, ఈహెచ్ఎస్‌ను రూ.25 లక్షలకు పెంచాలని, ఉపాధ్యాయులకు పనిభారాలను తగ్గించాలని, బోధనకే పరిమితం చేయాలన్నారు. తహసీల్దార్ ఎ.కాశీకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు ఝాన్సీ, సహాయ కార్యదర్శి లంకా రాజు, పట్టణ నాయకులు కె.రమేష్‌బాబు, ఎం.నాగరాట్నాలు, పి.నాగరాజు, ఎస్.శ్రీనివాసరావు, ఎం.పుష్పరాజు, ఎం.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


పెదతాడేపల్లి హాస్టల్ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా అనారోగ్య సమస్యలు రావని హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గున్యా, ఫైలేరియా వ్యాధులు పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ప్రతి విద్యార్థి తప్పక పర్సనల్ హైజీన్ పాటించాలని, నీరు, ఆహారం, గాలి ద్వారా వ్యాపించే వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రత్నాజీ, ఏఎన్ఎం సుసన్న, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పని నిర్వహణలో అంగన్‌వాడీ పాత్ర కీలకం


మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి కల్యాణి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాతా శిశు మరణాలు రేటును తగ్గించేందుకు కృషి చేస్తున్న ఐసీడీఎస్ పని నిర్వహణలో అంగన్‌వాడీలు పాత్ర చాలా కీలకమైందని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు కె.ఝాన్సీ, డి.కల్యాణిలు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం అంగన్‌వాడీ జిల్లా యూనియన్ సమావేశం జరిగింది. వక్తలు మాట్లాడుతూ ఈ నెల 15, 16 తేదీలలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా 8వ మహాసభలు తాడేపల్లిగూడెంలోని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో జరగనున్నాయని, విజయవంతం చేయాలని కోరారు. జిల్లా నలుమూలల నుంచి 300 మందికి పైగా ప్రతినిధులు, రాష్ట్ర స్థాయి నేతలు హాజరవుతారని చెప్పారు. అంగన్‌వాడీ పని క్రమంలో ఎదురువుతున్న ఆయా సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎనలేని కృషి జరుగుతుందని చెప్పారు. ఎండీ హసీనా, శ్యామలకుమారి, ప్రసన్న, దీనకుమారి పాల్గొన్నారు.

పెంటపాడు పీహెచ్‌సీ పరిశీలన


పెంపాడులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న జిల్లా మలేరియా సహాయాధికారి నాగబాబు

పెంటపాడు: ప్రజలకు సేవ చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మలేరియా సహాయ అధికారి యాతం నాగబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రికార్డులు పరిశీలించారు. సచివాలయాల వద్ద ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి తోట రాజేష్, సబ్‌యూనిట్ అధికారి ఎస్వీఎస్ ప్రసాద్, ఎంపీహెచ్ఈవో వెంకట్రావు, మారిశెట్టి తేజోనాథ్, వెంకటలక్ష్మి, రాజకుమారి, కాంతారావు పెంటపాడు పీహెచ్‌సీ పరిదిలోని సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల మందు పంపిణీ


పేకేరు గ్రామంలో ఎలుకల మందు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఇరగవరం: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం రైతు సేవా కేంద్రల వద్ద ఎలుకలు నివారణ మందును పంపిణీ చేశారు. అందులో భాగంగా కంతేరు, పేకేరు గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి వై రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరావు మాట్లాడుతూ వరిలో ప్రతి ఏటా ఎలుకలు వలన 5 నుంచి 15 శాతం దిగుబడి తగ్గుతుందన్నారు. ముఖ్యంగా పిలక చేసే దశలో ఎలుకలు పిలకలను కత్తిరించడం వలన దిగుబడి ఘననీయంగా తగ్గిపోతుందన్నారు. రైతులందరూ ఎలుకలను సామూహికంగా నివారించుకోవాలని తెలిపారు. ప్రస్తుతం బ్రోమోడయోలిన్ విషపు ఎరను 96 పాళ్ల నూకలు, 2 పాళ్ల నూనె 2పాళ్ల విషపు ఎర 10గ్రాములు చొప్పున పొట్లాలు కట్టుకుని తెరిచి ఉన్నా బొరియలు వద్ద పెట్టాలన్నారు. అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.